# 18 నుండి వీఓఏల నిరవధిక సమ్మె

- కనీస వేతనం 20 వేలు ఇవ్వాలని డిమాండ్
- ఏపీఎంకు నోటీసు ఇచ్చిన జైపూర్ మండల సభ్యులు
- తెలంగాణ ఐకేపీ జేఏసీ పిలుపు



**మంచిర్యాల, మే 07 (జనం పవర్):** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని 31 మంది గ్రామ సంఘం అసిస్టెంట్ వీఓఏలు జైపూర్ ఏపీఎంకు సమ్మె నోటీసు అందజేశారు. తెలంగాణ ఐకేపీ (సెర్ప్) జేఏసీ వీఓఏ ఆధ్వర్యంలో ఈ నెల 6న నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో మే 18 నుండి వీధుల నుంచి మినహాయించుకుని శాంతియుత పోరాటం చేయనున్నట్లు వారు స్పష్టం చేశారు. వీఓఏలకు కనీస వేతనం 20,000 రూపాయలు ఇవ్వాలని, వీరిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ప్రత్యేక హెచ్ఆర్ పాలసీని రూపొందించాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. వీఓఏలకు 20 లక్షల రూపాయల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, అర్హత గల వారికి సీసీలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. వీధి నిర్వహణ కోసం ట్యాబు సౌకర్యం కల్పించడంతో పాటు జీఓ 11058ను తక్షణమే సవరించాలని నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త తీర్మానం మేరకు వీఓఏలందరూ ఈ సమ్మెలో పాల్గొనాలని యూనియన్ నాయకులు కోరారు. చట్టబద్ధంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసమే ఈ నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలు తీర్చాలని, లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జైపూర్ మండల వీఓఏలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తి చేయాలి

జైపూర్ మండలంలో ఎంపీఓ శ్రీపతి బాపురావు ఆకస్మిక తనిఖీ

కూలీల హాజరు పెంచాలని కార్యదర్శులకు ఆదేశం



**జైపూర్, మే 07 (జనం పవర్):** మంచిర్యాల జిల్లా జైపూర్ మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు గురువారం పలు గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రామారావుపేట, ఇందారం, టేకుమట్ల, ఎల్కంటి గ్రామ పంచాయతీలను సందర్శించిన ఆయన, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ దశలలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పనులను సందర్శించిన ఎంపీఓ, ఎండల దృష్ట్యా కూలీలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. వర్క్ సైట్ల వద్ద త్రాగునీరు, నీడ వసతి కల్పించాలని ఆదేశించారు. కూలీల హాజరు శాతం పెంచేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, పేమెంట్ పెండింగ్ ఉన్న వారి వివరాలను సేకరించి హౌసింగ్ శాఖకు అందజేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు గ్రామాల్లోని చలివేంద్రాలను ఎంపీఓ తనిఖీ చేశారు. ప్రజలకు చల్లని త్రాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. యాప్ ఇన్‌స్పెక్షన్ కోసం పంచాయతీ రికార్డులను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ పర్యటనలో రామారావుపేట సర్పంచ్ పులి రాజశేఖర్, ఉప సర్పంచ్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు పీ. సురేష్, ఎల్. ప్రశాంత్, ఆర్. శ్రావణి, టీ. శ్రీనివాస్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల అమలులో అంగన్వాడీలే కీలకం

అంగన్వాడీ కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ

సంగారెడ్డి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



**సంగారెడ్డి, మే 07 (జనం పవర్):** ప్రభుత్వ పథకాలను పక్కాగా అమలు చేయడంలో అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలది కీలక పాత్ర అని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. గురువారం సంగారెడ్డి పట్టణంలోని మహిళా ప్రాంగణంలో అంగన్వాడీ కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్లను అందించే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు పక్కాగా అమలు చేసే విషయంలో అంగన్వాడీలది కీలక పాత్ర అని కొనియాడారు. వీరికి ప్రభుత్వం అన్ని వీధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆన్‌లైన్ సేవలను పక్కాగా వినియోగించి సంగారెడ్డి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, కౌన్సిలర్లు సంగీత మహేష్, శ్రీకాంత్ గౌడ్, సీడీపీఓలు చంద్రకళ, జయరామ్ నాయక్ పాల్గొన్నారు. ప్రభుత్వం అందించిన స్మార్ట్ ఫోన్ల ద్వారా రికార్డుల నిర్వహణ మరింత సులభతరం కానుందని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.



# టేకు అక్రమ రవాణా.. నిందితుడికి 14 రోజుల రిమాండ్

తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో


టేకు దుంగలను అక్రమముగా రవాణా చేస్తూ, ఇంట్లో నిల్వ ఉంచిన కేసులో నిందితుడు లావుడ్యా హరికృష్ణను అటవీ శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. గురువారం నిందితుడిని లక్సెట్టిపేట గౌరవ న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ వివరాలను ఇందన్ పల్లి ఎఫ్.ఆర్.ఓ లక్ష్మీనారాయణ వెల్లడించారు. హరికృష్ణ కారులో టేకు దుంగలను అక్రమముగా తరలించడమే కాకుండా, వాటిని తన నివాసంలో దాచి ఉంచినట్లు విచారణలో తేలింది. ఈ దాడుల్లో ఎఫ్.ఎస్.ఓ రవి, ఎఫ్.బీ.ఓ లు రాజేశ్వర్, శ్రీనివాస్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు. అడవుల నుంచి కలపను అక్రమముగా తరలిస్తే ఉపేక్షించేది లేదని అధికారులు హెచ్చరించారు. అటవీ ప్రాంతంలోని ఎకో సెన్సిటివ్ జోన్ (ఎకో సెన్సిటివ్ జోన్)లో ఇసుక రవాణా చేసే వారిపై చట్టపరముగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వన్యప్రాణులను వేటాడే వారిపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కలప, ఇసుక అక్రమ రవాణా లేదా వన్యప్రాణుల వేట గురించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలని వారు కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యముగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అటవీ సంపదను కాపాడటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అడవుల సంరక్షణే ధ్యేయముగా తనిఖీలు ముమ్మరం చేస్తామని ఎఫ్.ఆర్.ఓ పేర్కొన్నారు.

# టీవీ వద్దన్నందుకు విద్యార్థిని ఆత్మహత్య

చదువుకోమని మందలించినందుకు బలవన్మరణం

చికిత్స పొందుతూ కరీంనగర్‌లో మృతి..రోటిగూడ గ్రామంలో విషాదఛాయలు

తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో



చదువు విషయంలో తల్లిదండ్రుల హెచ్చరిక ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. టీవీ చూడటం మానేసి చదువుపై దృష్టి పెట్టాలని మందలించడంతో మనస్తాపం చెందిన డిగ్రీ విద్యార్థిని గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రోటిగూడలో ఈ విషాదం చోటుచేసుకుంది. లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న మోత్కూరి అక్షిత (19)కు ఇటీవల సెమిస్టర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయి. ఇంటి వద్ద తరచూ టీవీ చూస్తుండటంతో తల్లిదండ్రులు ఆమెను మందలించారు. దీంతో మనస్తాపం చెందిన అక్షిత, ఈ నెల 3న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగింది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మెరుగైన చికిత్స కోసం అక్షితను కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా, మృత్యువుతో పోరాడుతూ గురువారం తుదిశ్వాస విడిచింది. తండ్రి లక్ష్మీనారాయణ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. చేతికి వచ్చిన కూతురు కళ్లముందే కన్నుమూయడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# వైద్యరంగ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

చెన్నూర్ 100 పడకల ఆసుపత్రి పనుల పరిశీలన

పనుల్లో వేగం పెంచాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

వేల్పుల నగేష్ ,జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో

వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం చెన్నూర్ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, పీహెచ్‌సీ పనులను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

## తుది దశలో ఆసుపత్రి పనులు

ఆసుపత్రి పనులు తుది దశకు చేరుకున్నాయని, నిర్మాణాన్ని మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ గుత్తేదారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం త్వరలోనే అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# గల్ఫ్ బోర్డు కోసం 500 కోట్లు కేటాయించాలి

మాజీ మంత్రి హరీశ్ రావుతో జన్నారం గల్ఫ్ కార్మికుల భేటీ

మృతుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

గల్ఫ్ బాధితుల పక్షాన అసెంబ్లీలో గళం విప్పాలని విజ్ఞప్తి

తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో

గల్ఫ్ కార్మికుల బతుకులు మారాలంటే ప్రత్యేక బోర్డు ఏర్పాటు ఒక్కటే మార్గమని, ఈ దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని మాజీ మంత్రి హరీశ్ రావును జన్నారం మండల గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి కోరింది. మండల అధ్యక్షుడు మగ్గిడి తిరుపతి నేతృత్వంలోని ప్రతినిధి బృందం హరీశ్ రావును కలిసి కార్మికుల గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రధానంగా మూడు అంశాలను ప్రస్తావించారు. గల్ఫ్ బాధితుల కోసం 500 కోట్ల రూపాయలతో తక్షణమే బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విదేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా అందేలా చూడాలని కోరారు. ఏళ్లుగా గల్ఫ్ కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై అసెంబ్లీలో గళం విప్పాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల ఆవేదనను విన్న హరీశ్ రావు సానుకూలంగా స్పందించారు. గల్ఫ్ బిడ్డలకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ రక్షణ కవచంలా ఉంటుందని, ప్రభుత్వం వారి డిమాండ్లను నెరవేర్చేలా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా రికవరీ చీఫ్ శంకర్ నాయక్, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ రాంపాల్ నాయక్, గల్ఫ్ కార్మిక నాయకుడు బాదావత్ శ్రీనివాస్ నాయక్ తోపాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తామని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు.

# కుష్టు రోగులకు 8 ఏళ్లు సేవ చేశా

నర్సుగా పనిచేసిన జ్ఞాపకాలను పంచుకున్న నిర్మలా జగ్గారెడ్డి

నర్సింగ్ విద్యార్థులకు ఆదర్శంగా టీజీఐఐసీ చైర్ పర్సన్

సంగారెడ్డిలో ఘనంగా నర్సుల దినోత్సవ వేడుకలు




**సంగారెడ్డి, మే 07 (జనం పవర్):** రాజకీయాల్లోకి రాకముందు తాను నర్సుగా పనిచేసి రోగులకు సేవలు అందించానని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నివాళులు అర్పించి తన వృత్తిపరమైన జ్ఞాపకాలను విద్యార్థులతో పంచుకున్నారు. మారుమూల గ్రామం నుండి వచ్చిన తాను నర్సింగ్ వృత్తిపై మక్కువతో బీఎస్సీ నర్సింగ్ చదువుకున్నానని నిర్మలా జగ్గారెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ సుమారు 8 సంవత్సరాల పాటు కుష్టు రోగుల వార్డులో పనిచేసినట్లు పేర్కొన్నారు. వారికి సేవ చేయడం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని చెప్పారు. నర్సింగ్ విద్యార్థులు కూడా రోగుల పట్ల సేవా భావంతో మెలిగి వృత్తికి గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు. తన భర్త జగ్గారెడ్డి ప్రోత్సాహంతోనే ఉద్యోగాన్ని వదిలి ప్రజా సేవ కోసం రాజకీయాల్లోకి వచ్చినట్లు ఆమె వివరించారు. నర్సింగ్ రంగంలో ఉన్న వారు ఎదుర్కొనే ఇబ్బందులను తాను స్వయంగా చూశానని, వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ వనిత, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, కౌన్సిలర్లు, సీడీపీఓలు పాల్గొన్నారు.

జనం పవర్
JANAM POWER



# తిలక్ నగర్‌లో కార్డెన్ సెర్చ్.. 66 వాహనాలు సీజ్

**పత్రాలు లేని వాహనాలపై పోలీసుల కొరడా**

**గంజాయి, ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలి: మంచిర్యాల ఏసీపీ ప్రకాష్**



**వేల్పుల నగేష్ ,జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

రామగుండం కమిషనరేట్ పరిధిలోని తిలక్ నగర్‌లో డీసీపీ, ఏసీపీ ప్రకాష్, పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు ఆధ్వర్యంలో గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా నంబర్ ప్లేట్లు, సరైన పత్రాలు లేని 58 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలను పోలీసులు సీజ్ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో యువత, పెద్దలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏసీపీ ప్రకాష్ సూచించారు. యువత గంజాయి వంటి వ్యసనాలకు, ఆన్‌లైన్ గేమ్‌లకు బానిస కావద్దని కోరారు. రాత్రిపూట గొడవలు చేసే రౌడీలను, దొంగలను పసిగట్టేందుకు కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐలు మధుసూదన్, తిరుపతి, మజారుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

# సెటిల్మెంట్లకు అడ్డాగా పోలీస్ స్టేషన్

**అధికార పార్టీకి తొత్తులుగా సీఐ, ఎస్ఐలు**

**డబ్బులు ఇస్తేనే సమస్యల పరిష్కారం**

**మాజీ వైఎస్ఆర్సీపీ నేత శ్రీధర్ రెడ్డి ఆరోపణ**



**కొండాపూర్, మే 08 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలో పోలీసుల తీరుపై మాజీ వైఎస్ఆర్సీపీ జిల్లా అధ్యక్షుడు గౌరెడ్డి శ్రీధర్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. మండలంలోని తొగర్‌పల్లి గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కొండాపూర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐ, ఎస్ఐలు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మండల ప్రజలకు పోలీస్ స్టేషన్‌లో న్యాయం జరగడం లేదని, గ్రామాల్లో వివాదాలు, తగాదాలు వచ్చినప్పుడు డబ్బులు తీసుకున్న తర్వాతే పరిష్కారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పోలీస్ స్టేషన్ సెటిల్మెంట్లకు అడ్డాగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలకు న్యాయం చేయాల్సిన పోలీసులు రాజకీయ ప్రభావాలకు లోనై వ్యవహరిస్తున్నారని ఆరోపించిన శ్రీధర్ రెడ్డి, ఈ వ్యవహారంపై జిల్లా ఎస్పీ వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే డీజీపీని కలిసి పూర్తి వివరాలతో ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

# ఎంఎల్సీ కోదండరాంకు ఫోరమ్ ప్రతినిధుల శుభాకాంక్షలు

**ఉద్యమకారుల హామీల అమలుకు విన్నపం**

**ఎంఎల్సీగా ఎంపికైనందుకు ఘనంగా అభినందనలు**

**సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సన్మాన కార్యక్రమం**

**సంగారెడ్డి, మే 07 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టీజేఎస్ అధ్యక్షులు ఎంఎల్సీ ప్రొఫెసర్ కోదండరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర, ప్రధాన కార్యదర్శి అమిదిపురం మహేష్ కుమార్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఎంఎల్సీగా ఎంపికైనందుకు కోదండరాంకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మల్లేష్, రాజు మార్కుంది, టీజేఎస్ నాయకులు కుమ్మరి సాయిలు, జీ. మల్లయ్య పాల్గొన్నారు. వీరంతా ఎంఎల్సీని కలిసి సత్కరించి అభినందనలు అందజేశారు. కోదండరాంకు నూతన పదవి దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పుష్పగుచ్ఛం అందించారు. తెలంగాణ ప్రభుత్వం ద్వారా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా కృషి చేయాలని ఎంఎల్సీ కోదండరాంను ఈ సందర్భంగా కోరారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కోదండరాం సానుకూలంగా స్పందించారు.




# చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు

- సన్న వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్
- రహదారి విస్తరణ బాధితులకు షాపింగ్ కాంప్లెక్స్ లో ప్రాధాన్యత
- రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద



**వేల్పుల నగేష్ ,జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

రైతుల వద్ద ఉన్న చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. గురువారం చెన్నూర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందిస్తున్నట్లు వెల్లడించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు.

**ధాన్యం రక్షణకు ప్రత్యేక చర్యలు**

అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా ఉండేందుకు జిల్లాలో గోదాములను అద్దెకు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. హమాలీల కొరత, ఎండల దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో కొనుగోలు ప్రక్రియ సాగించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం జిల్లాలో రోజుకు 150 లారీల ధాన్యం రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం రాకుండా సరిహద్దుల్లో నిఘా పెట్టామన్నారు. జిల్లాలో 1.83 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు కలెక్టర్ వివరించారు.

**నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష**

చెన్నూర్ మున్సిపల్ అభివృద్ధి పనులపై కౌన్సిలర్లతో మంత్రి చర్చించారు. రహదారి విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వారికి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లో గదులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. స్థలం కోల్పోయిన వారికి టీడీఆర్ లో వెసులుబాటు కల్పిస్తామన్నారు. పట్టణంలో మురుగు కాలువలు, రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో అనవసర పుకార్లను నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ, వైస్ చైర్మన్ వినయ్ కుమార్, తహసిల్దార్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

# పదవ తరగతి టాపర్ విశేష్‌కు ఘన సన్మానం

- 96.6 శాతం మార్కులతో ప్రతిభ చాటిన విద్యార్థి
- బీడీఎస్ఎఫ్, బ్లట్ ఆధ్వర్యంలో సత్కారం
- ఈ నెల 10న అవగాహన సదస్సు, సన్మానం



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రేణుకానగర్ కాలనీలో పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థి కొమ్ము విశేష్‌ను బీ డీ ఎస్ ఎఫ్ బహుజన ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య, బ్లట్ బహుజన్ లెఫ్ట్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విశేష్ నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బీ డీ ఎస్ ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు దబ్బేట ఆనంద్ మాట్లాడుతూ, ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో సిద్దిపేట గ్రామీణ మండలంలోని రావురుకుల గ్రామానికి చెందిన కొమ్ము దుర్గారాములు కుమారుడు కొమ్ము విశేష్ 96.6 శాతం మార్కులు సాధించి ప్రతిభ చాటాడని తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి ఇంతటి ఫలితం సాధించడం గర్వకారణమన్నారు. విశేష్ ఒకటో తరగతి నుండి ఎనిమిదో తరగతి వరకు స్వగ్రామంలో చదివి, అనంతరం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీవాణి హైస్కూల్‌లో చేరి పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాడని పేర్కొన్నారు. పాఠశాలలోనూ విశేష్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రత్యేక స్థానం సంపాదించాడన్నారు. విశేష్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తల్లిదండ్రులు కొమ్ము దుర్గారాములు, జ్యోతి కుటుంబ సభ్యులతో పాటు పలువురు ఆకాంక్షించారు. అదేవిధంగా ఈ నెల 10వ తేదీ ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో సిద్దిపేట రూరల్ ప్రభుత్వ పాఠశాలలలో పదవ తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించి అనంతరం సన్మాన కార్యక్రమం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఎర్ర కృష్ణ, చందులపురం కోటేశ్వరరావు, బ్లట్ ట్రేడ్ యూనియన్ నాయకులు శివరాత్రి శ్రీనివాస్, ర్యాకం మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి వార్షికోత్సవాలు

- వైభవంగా 35వ త్రయాహ్నిక ఉత్సవాలు
- నేడు సిద్దిపేట పురవీధుల్లో స్వామివారి రథోత్సవం
- మున్సిపల్ చైర్మన్ కు ఘన సన్మానం



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలోని నీలకంఠేశ్వర నగర్‌లో గల శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి దేవాలయం లో శ్రీ గౌరీ సహిత నీలకంఠేశ్వర స్వామి వారి పంచత్రింశతి (35వ) త్రయాహ్నిక వార్షికోత్సవాలు, కళ్యాణోత్సవం, రథోత్సవం ఈ నెల 6 నుండి 8వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించబడుతున్నాయి. ఈ సందర్భంగా గణపతి పూజా కార్యక్రమాలు, వీరభద్ర పూజలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం మంటప పూజ, ఆవాహిత దేవతా పూజలు, అభిషేకాలు, పూర్ణాహుతి, మహా నివేదన, మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం, ఋత్విక్ సన్మాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు దేవాలయం నుండి సిద్దిపేట పురవీధుల గుండా స్వామివారి రథోత్సవం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమాలకు వైదిక నిర్వహణగా బ్రహ్మశ్రీ ఉమాపతి రామేశ్వర శర్మ, దేవస్థాన అర్చకులు శివశ్రీ కిన్నెర రంజిత్ కుమార్ సేవలందిస్తున్నారు. టెంట్ సామాను సహకారాన్ని న్యూ మమత & శ్రీ భారత్ టెంట్ హౌజ్ ప్రొప్రైటర్ రాయిని బాల్‌రాజు అందించారు.

**మున్సిపల్ చైర్మన్ కు సన్మానం**

అదేవిధంగా కార్యక్రమం అనంతరం సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజుల-రాజనర్సు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కడవేర్గు నర్సింలు, అధ్యక్షులు గుండ్ల యోగేశ్వర్, ప్రధాన కార్యదర్శి అబ్బతిని సురేష్, కోశాధికారి కాల్వ శ్రీకాంత్, ఉపాధ్యక్షులు గుండ్ల జనార్దన్, కాల్వ శంకర్, సహాయ కార్యదర్శులు కడవేర్గు యాదగిరి, రాయిని భాస్కర్‌తో పాటు నారాయణ, రామచంద్రం, యాదగిరి, రాజు, దేవదాస్, బాలరాజ్, సతీష్, రమేష్, వెంకటేష్, జనార్దన్, లక్ష్మీరాజ్యం, లక్ష్మీనారాయణ, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ కేంద్రాల్లో అడ్డగోలు దోపిడీ!



## యాభై రూపాయల పనికి వేలల్లో ఖర్చు



### జన్నారంలో ఇష్టారాజ్యంగా మీసేవ నిర్వాహకుల తీరు

- ఏడు సార్లు తిప్పించుకున్నారని తపాలాపూర్ వాసి ఆవేదన
- పల్లెల్లో ఉండాల్సిన కేంద్రాలు మండలంలోనే..
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారి లైసెన్సులు రద్దు చేయాలి
- తహసీల్దార్ తక్షణమే స్పందించాలని ప్రజల డిమాండ్

**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

జన్నారం మండల కేంద్రంలోని ఆధార్, మీసేవ కేంద్రాల నిర్వాహకుల తీరు సామాన్యుల పాలిట శాపంగా మారింది. కేవలం యాభై రూపాయలతో పూర్తి కావాల్సిన పనులకు వేల రూపాయలు ఖర్చు చేయిస్తూ పేదల కడుపు కొడుతున్నారని మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కూలీ పనులు వదులుకుని..**

కూలీ పనులు వదులుకుని పనుల కోసం వస్తే తీవ్రంగా నష్టపోతున్నామని తపాలాపూర్ గ్రామానికి చెందిన బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. రోజువారీ కూలీ పనులకు వెళ్తే మూడు వందల నుంచి ఐదు వందల వరకు వస్తుందని, తపాలాపూర్ నుంచి జన్నారం రావడానికి ఒక్కొక్కరికి వంద రూపాయల ప్రయాణ ఖర్చు అవుతుందని బాధితుడు సత్తన్న వాపోయాడు. ఆధార్ కార్డు కోసం ఏడు సార్లు తిప్పించుకోవడం వల్ల కూలీ రాక, ప్రయాణ ఖర్చులు పెరిగి వేల రూపాయలు నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశాడు. కేవలం యాభై, అరవై రూపాయలలో అయిపోయే పనుల కోసం సామాన్యులను ఇన్ని సార్లు తిప్పించడం ఏంటని ప్రజలు నిలదీస్తున్నారు.

**మండల కేంద్రంలోనే తిష్ట..**

ఏ గ్రామానికి కేటాయించిన మీసేవ కేంద్రం ఆ గ్రామంలోనే ఉండాలనే నిబంధన ఉన్నా.. చాలా కేంద్రాలను నిబంధనలకు విరుద్ధంగా మండల కేంద్రంలోనే నిర్వహిస్తున్నారు. దీనివల్ల చిన్న కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం కూడా గ్రామాల నుంచి మండలానికి రాకతప్పడం లేదు. ఒక సర్టిఫికెట్ కోసం వస్తే అధికారులు లేరని ఒకసారి, రెండు రోజుల తర్వాత రమ్మని మరోసారి తిప్పుకుంటున్నారు. దీనివల్ల నిరుపేదల సమయం వృథా కావడంతో పాటు, ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే రెట్టింపు వసూలు చేస్తూ నిలువుదోపిడీ చేస్తున్నారు.

**లైసెన్సులు రద్దు చేయాలి..**

ఒకవైపు కూలీ పని పోతూ, మరోవైపు అధిక వసూళ్లతో జేబులు ఖాళీ అవుతుంటే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రజలు మండిపడుతున్నారు. అధిక వసూళ్లకు పాల్పడుతూ, దురుసుగా ప్రవర్తిస్తున్న పవన్ అనే నిర్వాహకుడిపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఏ గ్రామానికి కేటాయించిన కేంద్రాన్ని ఆ గ్రామంలోనే నిర్వహించేలా తహసీల్దార్ ఉత్తర్వులు జారీ చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తున్న సెంటర్ల లైసెన్సులను తక్షణమే రద్దు చేయాలని కోరుతున్నారు. ప్రజల ఆవేదనను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు, వివిధ సంఘాల నాయకులు కోరుతున్నారు.




# సిద్దిపేట ఆత్మ కమిటీ చైర్మన్‌గా పూజల గోపికృష్ణ

**యువనేతకు దక్కిన కీలక బాధ్యత**

**నియామక పత్రం అందజేసిన మంత్రి గద్దం వివేక్**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్‌గా సిద్దిపేటకు చెందిన యువనేత పూజల గోపికృష్ణ నియమితులయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని నివాసంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ గడ్డం వివేక్ వెంకటస్వామి, సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణల చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని స్వీకరించారు. చిన్న వయస్సులోనే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని విద్యార్థి దశ నుంచే రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన గోపికృష్ణ, ఎన్ఎస్‌యూఐలో అడుగుపెట్టి కళాశాల అధ్యక్షుడిగా సేవలందించారు. అనంతరం ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేసి రాష్ట్ర స్థాయి పదవులు చేపట్టారు. విద్యార్థులు, యువత సమస్యలపై పలు ఉద్యమాలు నిర్వహిస్తూ, ఢిల్లీలో లాఠీ దెబ్బలు తిన్నా, కేసులకు భయపడకుండా పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన నాయకుడిగా గుర్తింపు పొందారు. రైతులు, యువత, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే గోపికృష్ణ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసిన నాయకుడని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా తనకు ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజా నరసింహ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళ కాంగ్రెస్, ఎస్సీ, బీసీ, మైనార్టీ సెల్ నాయకులు, కార్యకర్తలందరికీ గోపికృష్ణ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

**ఆత్మ కమిటీ సభ్యుల నియామకం**

ఆత్మ కమిటీ సభ్యులుగా పులగుర్ల రజిత, గణపురం సంతోషి, ఉమాదేవి, అఖిల, గూడెపు దేవలక్ష్మి, ఆబాకి సంగీత, బత్తుల స్రవంతి, ముతకాని పోచవ్వ, ఆదెరెడ్డి బాలయ్య, ఐరేని అంజిరెడ్డి, బొజ్జ రాజకుమార్, ఆడపు లక్ష్మీనారాయణ, మహమ్మద్ అజ్మత్ అలీ, రాకేష్ యాదవ్, సీత బాలు, బందెల కనకయ్య, మద్దూరి ఎల్లయ్య, ఎర్ర శ్రవణ్, నరాల బాబు, ఎర్రోళ్ల బాబు, బండి శివకుమార్, రాచకొండ కనకయ్య, అనురాజు నాగరాజు, ఉడుత ప్రశాంత్, గూడెంపు శ్రీనివాస్, శివరాత్రి తిరుపతి, పీ. వెంకటేష్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మల యాదగిరి, రాష్ట్ర మైనార్టీ నాయకులు కలిమోద్దీన్, ఎర్ర మహేందర్, చెంది శ్రీనివాస్, అశోక్, అమర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. పూజల గోపికృష్ణ నియామకం పట్ల సిద్దిపేట కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

# గోవుల అక్రమ రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

**చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ**

**అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు**

**డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పిలుపు**

**సంగారెడ్డి, మే 07 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రాష్ట్ర సరిహద్దులు, ప్రధాన రహదారులు, జాతీయ రహదారులు, అనుమానాస్పద మార్గాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ పలు చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి ఏర్పాట్లు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గోవుల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్ట విరుద్ధంగా రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేసి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. గోవుల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల పాత్ర ఎంతో ముఖ్యమని ఎస్పీ పేర్కొన్నారు.



# విద్యుత్ కార్మికుల ఆశాజ్యోతి కామ్రేడ్ కిరణ్

- రాజీలేని పోరాటయోధుడు కిరణ్‌కు ఘన నివాళి
- యూఈఈయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడవ వర్ధంతి
- ఆయన ఆశయ సాధనే నిజమైన నివాళి: నలవాల స్వామి


**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేసి ఉద్యోగ కార్మికుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నాయకుడు కామ్రేడ్ కిరణ్ అని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (యూఈఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలవాల స్వామి పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం విద్యుత్ కార్మికులంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

**ఘనంగా వర్ధంతి వేడుకలు**

గురువారం స్థానిక కార్మిక కర్షక భవన్‌లో మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కిరణ్ ఏడవ వర్ధంతి





కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో నలవాల స్వామి మాట్లాడుతూ, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్‌లో యూనియన్ ఏర్పాటు కోసం మొట్టమొదటిగా ఉద్యమాన్ని నిర్మించిన నాయకుల్లో కామ్రేడ్ కిరణ్ ఒకరని గుర్తు చేశారు.

**కార్మిక హక్కుల కోసం పోరాటం**

తన చివరి శ్వాస వరకు విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు నిర్వహించిన స్ఫూర్తిదాయక నాయకుడు కామ్రేడ్ కిరణ్ అని కొనియాడారు. నేడు ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన కలలు కన్న ఆర్టిజన్ కన్వెన్షన్ వంటి కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఆయన స్ఫూర్తితో ఉద్యమాలు నిర్మించి విద్యుత్ కార్మికుల హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అదే కామ్రేడ్ కిరణ్‌కు అందించే నిజమైన నివాళి అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాట మధు, సీఐటీయూ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, ఇప్పకాయల శోభ, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి జాలిగాపు శిరీష, యూనియన్ జిల్లా అధ్యక్షులు అశోక్, డివిజన్ అధ్యక్షులు కర్ణాకర్, నాయకులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు. కామ్రేడ్ కిరణ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా వారు ప్రతిజ్ఞ చేశారు.



# ప్రతిభకు పదును!

## పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాల వెలికితీత



### సిద్దిపేటలో ఉత్సాహంగా సమ్మర్ క్యాంపులు

- కరాటే, యోగా, డ్యాన్స్, పెయింటింగ్ శిక్షణ
- మొబైల్స్, టీవీలకు దూరంగా చిన్నారులు
- శిబిరాలకు తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

వేసవి సీజన్ లో పిల్లలకు ప్రత్యేక ఆకర్షణగా సమ్మర్ క్యాంపులు నిలుస్తున్నాయి. పిల్లల శారీరక, మానసిక వికాసంతో పాటు వారి నైపుణ్యాల పెంపుదలకు ఈ శిబిరాలు అద్భుతమైన వేదికగా మారుతున్నాయి. డ్యాన్స్, పెయింటింగ్, కరాటే, యోగా, గిటార్ లాంటి కార్యక్రమాల ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుండగా, కొత్త స్నేహాలు కూడా ఏర్పడుతున్నాయి. కథలు చదవడం, సృజనాత్మక ఆటలు, కళాత్మక కార్యక్రమాలు పిల్లలను ఉత్సాహంగా, చురుకుగా ఉంచుతున్నాయి. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు తల్లిదండ్రులు కూడా పిల్లలను ఈ శిబిరాల్లో చేర్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు. సిద్దిపేట పట్టణంలోని అంబిటస్ స్కూల్, క్రాంతి స్కూల్ తదితర విద్యాసంస్థలు పిల్లల కోసం ప్రత్యేక వేసవి శిబిరాలను నిర్వహిస్తున్నాయి. యోగా, గిటార్, డ్యాన్స్, డ్రాయింగ్ లాంటి శిక్షణలను అందిస్తూ చిన్నారుల్లో ప్రతిభను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నాయి.

### ఆసక్తిగా పాల్గొంటున్న చిన్నారులు..

హరి ప్రియా నగర్ లోని భవాని డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో క్లాసికల్ నృత్య శిక్షణ కొనసాగుతుండగా.. డీ కొండ మైసమ్మ ఆలయంలో ప్రతి రోజు సాయంత్రం నామమాత్రపు ఫీజుతో కరాటే శిక్షణ అందిస్తున్నారు. అలాగే క్రాంతి స్కూల్ సెకండ్ బ్రాంచ్ లో యోగా సాధకురాలు శ్రీలత ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. పిల్లలు ఆసక్తిగా పాల్గొంటూ యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం లాంటి సాధనలను అభ్యసిస్తున్నారు. ఈ శిబిరాల ద్వారా పిల్లలు కేవలం వినోదానికే పరిమితం కాకుండా క్రమశిక్షణ, ఏకాగ్రత, శారీరక దృఢత్వం లాంటి మంచి లక్షణాలను అలవర్చుకుంటున్నారు. మొబైల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకునేందుకు ఈ సమ్మర్ క్యాంపులు ఎంతో దోహదపడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. వేసవి కాలంలో పిల్లల సమయాన్ని సృజనాత్మకంగా మలుస్తూ, వారి భవిష్యత్ అభివృద్ధికి తోడ్పడుతున్న ఈ ప్రత్యేక శిబిరాలకు తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.













